## 13

# అంతిమ భవిష్యత్తు

## (ప్రకటన 21 మరియు 22)

ఆదికాండములోని విశ్వము మరియు సమయం సృష్టితో మనం మన అధ్యయనమును ఆరంభించాము. “దేవుడు - పగటిని రాత్రిని వేరుపరచునట్లు ఆకాశవిశాలమందు జ్యోతులు కలుగును గాకనియు, అవి సూచనలను కాలములను దిన సంవత్సరములను సూచించుటకై యుండుగాకనియు పలికెను” (ఆదికాండము 1:14). వాక్య ప్రకారం కాలమునకు ఆరంభముంది. అలాగే వాక్య ప్రకారం దీనికి అంతము కూడా ఉంది. సమయం గురించి ఇతర మతాలు బోధిస్తున్నట్లుగా గాక, సమయం అనేది ఒక సరళరేఖవంటిదని వాక్యం బోధిస్తుంది. ఇది “ఏ” అన్న బిందువు ఉండి “బి” అన్న బిందువుకు ప్రయాణిస్తుంది. అంటే దీనికి ఆరంభం, అంతం రెండూ ఉన్నాయి. కాలం మరియు పదార్థం అనేవి పాడై తిరిగి ఉపయోగంలోకి వచ్చు వలయాకారం వంటివి కాదు. యిలా గాక వాక్య గ్రంథకర్తల అభిప్రాయం ప్రకారం లోకం అనేది కడవరి అంతం కాబోతుంది అన్న దృష్టిలో చూపించ బడింది. కాలం కేవలం అంతమే కాబోదు గాని, మహా విపత్తుతో అంతం కాబోతుంది.

యేసు తిరిగి వచ్చినప్పుడు, ఆఖరి సంఘటనలు చోటుచేసుకుంటాయి. అప్పుడు ఈ భౌతిక విశ్వం నాశనమయి నిత్యత్వములో మన ఉనికి ప్రారంభమవుతుంది. కొందరు నిరాశవాదులు చెప్తున్న మాటలకు పేతురు 2 పేతురు 3:3-10లో ప్రతిస్పందిస్తున్నాడు, “పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభముననున్నట్టే నిలిచి యున్నదని” (4 వచనం). మరో మాటలో చెప్పాలంటే, అంతము రాబోతుందని చెప్పుటకు ఇప్పటివరకు ఏమీ జరుగలేదు. కాబట్టి అంతము రాదని కొందరు భావిస్తున్నారు. ఇందుకు పేతురు ప్రతిస్పందిస్తూ, ఇదివరకు దేవుడు లోకమును జలప్రళయం చేత నాశనం చేశాడని (ఆదికాండము 6; 7) మరియు ఇప్పుడు మరోసారి అగ్నిచేత నాశనం చేయబోతున్నాడని చెప్తున్నాడు, “ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు” (9 వచనం) అని తన చదువరులకు గుర్తుచేస్తున్నాడు. దేవునికి సమయం అసంగతమైనది. ఆయన కాలమునకు నిబద్ధుడుకాడు. తరువాత పేతురు యిలా అంటున్నాడు: “అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును” (3:10). “కాలమునకు అంతం” రాబోతుంది.

యేసు ప్రభువు కూడ ఇదే విషయాన్ని స్పష్టంచేస్తున్నాడు. ఆ రోజు, ఆ ఘడియ ఎప్పుడో “ఎవరికీ తెలియదు” అని మత్తయి 24:36-44లో చెప్పారాయన, మనం అందుకు జాగ్రత్తపడి సన్నద్ధులమై యుండాలని ఆయన సూచిస్తున్నారు: “మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి” (24:44). ఆయన రాకడ సమయమును ముందుగానే చెప్పడం అసాధ్యం (కాబట్టి మనమలా చెప్పడం తప్పు) కానీ అందుకు మనం సిద్ధంగా ఉండడం సాధ్యమే. అది మనందరి బాధ్యత కూడాను.

"కానీ, ఒకవేళ అన్నియు నాశనం చేయబడితే, దేవుని ప్రజల భవిష్యత్తు ఏమిటి?" అని ఎవరైనా అడుగవచ్చు. ఇందుకు సరైన సమాధానమును ఇవ్వకుండా వాక్యం ముగించబడలేదు. మన "అంతిమ భవిష్యత్తును" గురించి ప్రకటన 21 మరియు 22 అధ్యాయములు చెప్తున్నాయి. భవిష్యత్తులో ఏం జరుగనుందని మాత్రమే గాక, కాలము అంతమైనప్పుడు, నిత్యత్వములో ఏం జరుగనుందని కూడ అవి మనకు బోధిస్తున్నాయి. ఈ రెండు అధ్యాయములలోను భవిష్యత్తును వివరించడానికి యోహాను ఎన్నో వివరణలను అందించాడు. "క్రొత్త ఆకాశము క్రొత్త భూమి" గురించి యోహాను తెలియజేశాడు. అలాగే, "పరిశుద్ధ పట్టణమైన నూతన యెరూషలేము," "వధువు" గురించి అతడు వివరించాడు. ఈ వర్ణనలన్నియు "పరలోకం" గురించినవే, దాని వివరించునవే. లేఖనములలో ప్రకటన 21 మరియు 22లు పరలోకమును గురించిన పూర్తి సమగ్ర సామాచారాన్ని యిస్తున్నాడు. బైబిలు గ్రంథం ఈ విధంగా సమాప్తమవడం ఆశ్చర్యం కాదు. ప్రస్తుత కాలమందు మనం పడుతున్న శ్రమలు ఏవయినా, దేవుడు మన నిమిత్తం మహిమకరమైన భవిష్యత్తును దాచియుంచాడని విశ్వాసులకు పూర్తి భరోసా ఇవ్వడం ఈ వాక్య భాగం యొక్క ఉద్దేశం. ఇక్కడ ఇవ్వబడిన వివరణనుబట్టి మనం అక్కడకు వెళ్ళుటకు ఏ త్యాగానికైనా సిద్ధపడి ఉండేలా నిర్ణయించుకుంటాము.

### "పరలోకం" అంటే ఏమిటి?

పరలోకం అనేది నిజానికి ఒక "ప్రదేశమా" లేక మన ఆత్మీయ ఉనికిని తెలిపే స్థితా? ఒకవేళ అది ఒక ప్రదేశం అయితే, అది ఎక్కడుంది? ఇవి సులభంగా సమాధానమిచ్చేంత సులభతర ప్రశ్నలు కావు. ఇందుకు రెండు కారణాలున్నాయి. (1) నిత్యత్వములో సమయం, స్థలం అనేవి ఇకనుండవు. కాబట్టి పరలోకం యొక్క "స్థలం" గురించి మాట్లాడడం కష్టతరము. (2) క్రొత్త నిబంధనలో పరలోకం గురించి చెప్పబడిన ప్రతి వాక్య భాగం కూడ అలంకార రీతిలో వాడబడింది. దీనంతటి బట్టి, మన ఊహకు అందని, మనం ఊహించుటకు, చిత్రీకరించుటకు మన గ్రహింపునకు అతీతమైన దానిని దేవుడు మనకు ఎలా వివరించగలడు? దీని గురించిన వాక్య భాగములన్నియు అలంకార రీతిలోనున్నాయి కాబట్టి దేనిని అక్షరార్థముగా తీసుకోవాలి, దేనిని తీసుకోకూడదు అని నిర్ధారించడం కష్టం.

అయితే ఒక సత్యం మాత్రం ప్రకటన 21 మరియు 22లో స్పష్టం చేయబడింది: తండ్రి యైన దేవునితోను, కుమారుడైన క్రీస్తుతోను, పరలోకంలో మనం శాశ్వత కాలం ఉండుటకు అక్కడకు మనం వెళ్ళాలి. "ఇదిగో. దేవుని నివాసము మనుష్యులతో కుడా ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు దేవుడు తానే ... వారికి తోడైయుండును" అని సింహాసనము నుండి గొప్ప స్వరము చెప్పుటను యోహాను విన్నాడని ప్రకటన 21:3లో యోహాను వ్రాస్తున్నాడు. మన సృష్టికర్త, విమోచకుని సన్నిధిలో మనం ఉండడమన్నది పరలోకమును మహిమాయుక్తముగా మారుస్తుంది.

"నూతన యెరూషలేము," పరిశుద్ధ పట్టణమైనా గాని, అక్కడ ఏ దేవాలయమును యోహాను చూడ లేదు; "దానిలో నాకు ఏ దేవాలయమును నాకు కనబడలేదు. సర్వాధికారియైన దేవుడగు ప్రభువును గొఱ్ఱెపిల్లయు దానికి దేవాలయమై యున్నారు. ఆ పట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను వానికక్కరలేదు; దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది; గొఱ్ఱెపిల్లయే దానికి దీపము" (21:22, 23). ఆ పరిశుద్ధ

పట్టణములో దేవుని దాసులు ఆయనను సేవించుచూ, ఆయన ముఖ దర్శనము చేయుచూ, ఆయన నామము తమ నొసళ్ళమీద ధరించుకొనియుందురు (యాజమాన్యమునకు గురుతు) ఆయనే వారి వెలుగైయుండును అని ప్రకటన 22:3-5లో వివరిస్తున్నాడు. మనలను నిర్మించిన దేవుడు మరియు మన నిమిత్తం చనిపోయి మనలను రక్షిస్తున్న క్రీస్తుని సన్నిధిలో శాశ్వతకాలం ఉండడమే "పరలోకం."

పరలోకమును "నా తండ్రి యిల్లు" అని యోహాను 14:1-3లో యేసు పిలుస్తున్నాడు. మన నిత్యత్వ గృహమును యిలా ఊహించడం ఎంత అద్భుతం! ఆ గృహములో మనకొరకు ఆయన గదులను సిద్ధపరుస్తున్నాడు. ప్రభువు ఒక దినమున వచ్చి మనలను అక్కడకు తీసుకువెళతారు. పరలోకమును వివరించుటకు ఒక విందు సమావేశ సన్నివేశమును మత్తయి 8:11 యిస్తుంది. మరణం తర్వాత ఇంతకాలం వరకు చనిపోయిన యూదుల ప్రముఖుల సరసన కూర్చుని యుండడమనే యూదుల భావనను ఇది చూపిస్తుంది. ప్రభువు బల్ల సమయంలో యేసు తన శిష్యులతో మాట్లాడుతూ ఇదే భావనను తన మాటలతో ప్రతిబింబించారాయన, "నా తండ్రి రాజ్యములో మీతోకూడ నేను ఈ ద్రాక్షరసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు, ఇకను దాని త్రాగను" (మత్తయి 26:29). ఈ సన్నివేశమును బట్టి పరలోకం అంటే, పరలోకపు బల్ల ఎదుట యేసుతో కూర్చుని దేవుని ఆతిథ్యమును స్వీకరించడం. తండ్రి ఇంటిలోను, పరలోకపు బల్ల ఎదుట కూర్చుని యుండడం అన్న ఈ రెండు వర్ణనలు దేవుని సన్నిధిలో శాశ్వతకాలం ఉండుట అనే అద్భుత దృశ్యాన్ని అవిష్కరిస్తున్నాయి.

### పరలోకం ఎలా ఉంటుంది?

పరలోకం యొక్క స్వరూప స్వభావాన్ని గురించిన మరియొక ముఖ్య ప్రశ్న ఇది. పరలోకం గురించి బైబిల్లోని ప్రతి వాక్య భాగమును పరిశోధించినను ఇంకనూ మనం అసంపూర్ణ సమాచారంతోనే మిగిలిపోతాము "పరలోకంలో మనం ఒకరినొకరమును గుర్తుపట్టగలమా?"; "మనం ఇప్పుడు ఉన్నట్లుగానే పరలోకంలోనూ కనబడతామా?" ఇందుకు సమాధానాలు మనకు ఇయ్యబడకపోయినను ఇటువంటి విషయాలను గురించి మనకు సహజంగానే ఆసక్తి కలుగుతుంది. అయితే పరలోకం ఎలా ఉంటుంది అని చెప్పుటకు తగు మాత్రములో ప్రకటన 21 మరియు 22 అధ్యాయములు మనకు సమాచారాన్నీ, వివరణను యిస్తున్నాయి.

*మొదటిగా, ఇక్కడున్న జీవితంకంటే పరలోకం భిన్నంగా ఉంటుంది.* పరలోకంలో క్రొత్త క్రమము ఉంటుంది; లోక సంబంధమైన నిబంధనలు అక్కడ వర్తించవు. "నూతన ఆకాశం మరియు నూతన భూమి" (21:1) అన్న వివరణతో యోహాను తన దర్శనమును వివరిస్తున్నాడు. "క్రొత్త" (నూతన) అన్న మాటకు గ్రీకు భాషలో రెండు పదాలున్నాయి. ఒకటి *"chronos"* (దీనినుండే "chronological" అన్న పదము వచ్చింది), "కాలవిధానంలో క్రొత్తది" అని దీని అర్థము. వాడబడిన మరొక మాట, *"kainos"* పూర్తిగా క్రొత్త విధానాన్ని ఇది సూచిస్తుంది. ఇది పాత దాని యొక్క క్రొత్త రూపం కాదు గాని క్రొత్తదైన ఆకాశం మరియు భూమి. దీన్నే వివరిస్తూ యోహాను కొన్ని విషయాలు ఇందులో భాగం కాదని తెలియజేస్తున్నాడు: "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను, ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించిపోయెనని" (21:4). దుఃఖమును, బాధను కలిగించునదేదియు అందులో ఉండని

పరిస్థితి యొక్క ఉనికిని మాత్రమే మనం ప్రస్తుతానికి ఊహించగలము.

నా చిన్నతనం నాటి ఒక సంఘటన నాకు గుర్తుకు వస్తుంది. మా నాయనమ్మ బైబిలు చదువుతుండగా నేను ఆమె కాళ్ళదగ్గర చేరి ఆడుకుంటున్నాను. నాకు అప్పుడు తెలియదుగాని, ఆమె అప్పుడు ప్రకటన గ్రంథం చదువుతుంది. ఉన్నట్లుండి, ఆమె కళ్ళనుండి కన్నీళ్ళు కారి నేలపడ్డాయి. నేను భయపడి ఆమె ప్రక్కన చేరి ఏం జరిగిందాయని అడిగాను. "ఏమీ లేదు, పరలోకం గురించి నేను చదువుతున్నాను. అక్కడకు ఇప్పుడే వెళ్ళాలనుంది" అని ఆమె అంది. ఆమె దేని గురించి చెప్తుందో నాకు అప్పుడు అర్థంకాలేదు. ఇప్పుడు తెలుసు, మా నాయనమ్మ చాలా దుర్భరమైన జీవితాన్ని వెళ్ళబుచ్చింది. తన యౌవ్వన దశలోనే విధవరాలు అయింది. గొప్ప నిరాశలో ఉండికూడ తన పిల్లలను చక్కగా పెంచింది. ఎన్నో సంవత్సరాలనుండి మానసిక, శరీరక అనారోగ్యంలో బాధపడిన తన కుమారుడ్ని కోల్పోయింది. అటువంటి ఆమె పరలోకం వెళ్ళడానికి ఆరాటపడడంలో ఆశ్చర్యంలేదు; ఎటువంటి హింస, భయములేని ఆకలి దప్పులు లేని, అనారోగ్య బాధలుండని, మనలను ప్రేమించువారికి వీడ్కోలు చెప్పనవసరం లేని శరీరంలో, హృదయంలో ఏ నొప్పులు లేని ఆ స్థలంలో జీవించడం ఎంత అద్భుతమో! ఇది భూలోకంలోని జీవితం కంటే ఎంతో భిన్నంగా ఉంటుంది.

*రెండవదిగా, పరలోకం అందంగా ఉంటుంది.* పరిశుద్ధ పట్టణం దేవుని మహిమగలదిగా యుంటుందని ప్రకటన 21:9-11లో యోహాను వివరిస్తున్నాడు "దానియందలి వెలుగు ధగధగ మెరయు సూర్యకాంతమువంటి అమూల్య రత్నమును పోలియున్నది" (11 వచనం). తరువాత ఆ పట్టణపు ప్రాకారము, దాని పునాదులు, ముత్యములతో అలంకరింపబడిన దాని గుమ్మములను గురించి అతడు వివరిస్తున్నాడు (21:18-21). దాని యొక్క పునాదులు అమూల్య రత్నములతో అలంకరింపబడియుండగా, అందులోని వీధులు బంగారుమయమైయున్నాయి. పట్టణము "స్వచ్ఛమగు స్ఫటికముతో" ఉన్నది.

అయితే ఇది పరలోకం యొక్క అక్షరార్థ వివరణ కాదు కానీ, నిజానికి పరలోకం దేనికంటే తక్కువగా మాత్రం ఉండదు. ఈ లోకంలోని అద్భుత ప్రకృతి సోయగాలను మనం ఊహించవచ్చుగాని, పరలోకంతో పోల్చుకుంటే అది ఒక మూలకు కూడ రావు. పరలోకంలో *ఏమున్నది* అని గాక పరలోకంలో *ఎవరున్నారు* అన్న దాని మీదనే దాని సౌందర్యం ఆధారపడియుంది. పరలోకంలో మనం "దేవుని మహిమ" చేత ఆవరింపబడియుంటాము. దీని కోసమే విశ్వాసులు ఎన్నో శతాబ్దముల తరబడి ఎదురు చూస్తారు. కీర్తనాకారుడు యిలా వ్రాస్తున్నాడు,

> యెహోవా యొద్ద ఒక్క వరము అడిగితిని
> దానిని నేను వెదుకుచున్నాను.
> యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన
>     ఆలయములో ధ్యానించుటకును
> నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో
>     నివసింపగోరుచున్నాను (కీర్తన 27:4).

దేవుడు "ఆత్మయైయున్నాడు" (యోహాను 4:24) గనుక "దేవుని సౌందర్యము" ఎలా ఉంటుందో మాత్రమే మనం ఊహించగలము. అయితే "ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము" (1 యోహాను 3:2) అని మనకు వాక్యంలో వాగ్దానం ఉంది. ఆయన సన్నిధి

పరలోకమును అతిసౌందర్యంగా మారుస్తుంది.

*మూడవదిగా, పరలోకము విస్తారమైనది.* ఒక దూత బంగారు కొలకర్రతో పరిశుద్ధ పట్టణమును కొలుచుటను గురించి ప్రకటన 21:15–17లో వ్రాయబడింది. పట్టణము యొక్క కొలతలను యోహానుకు అందించుటకు యిలా చేయబడింది. మొదటిగా, ఆ పట్టణము ఘనపరిమాణ ఆకారములోనున్నది: “ఆ పట్టణము చచ్చవుకమైనది. దాని పొడుగు దాని వెడల్పుతో సమానము, ... దాని పొడుగును ఎత్తును వెడల్పును సమముగా ఉన్నది” (21:16). ఇక్కడ కూడ ఇది అలంకార రీతిగానే చెప్పబడింది. ఈ ఆకారమునకు ఒక ప్రత్యేక కారణముంది. యెరూషలేములోని దేవాలయములో అతిపరిశుద్ధ స్థలము అంటే – నిబంధన మందసం పెట్టబడియున్న స్థలం – ఘనపరిమాణ ఆకారములోనే ఉన్నది (1 రాజులు 6:20). కాబట్టి, ఒక ఖచ్చిత ఘనపరిమాణ ఆకారము దేవుని నివాస స్థలమునకు ఆకారముగానున్నది. నూతన యెరూషలేము కూడా ఇదే ఆకారములోనే ఉంది.

ఎంతటి ఆకారం ఇది! దాని కొలత “750 కోసులు” అని యోహాను వివరిస్తున్నాడు. యోహాను చూస్తున్న ఈ పట్టణం దాదాపు 1,400 మైళ్ళ పొడవు, వెడల్పు, లోతు ఉంది. దీని కొలతతో మనకేదయినా ప్రయోజనం ఉందా? ఉంది. ఎందుకంటే పరలోకం వెళ్ళదలచిన వారికందరికి తగిన స్థలం అక్కడున్నదని ఇది తెలియజేస్తుంది. “నా తండ్రి యింట అనేక నివాసములు కలవు” (యోహాను 14:2ఎ) అని యేసు చెప్పారు. కొంతమంది ఆ పట్టణమును “క్రుంగజేయుటకు” ప్రయత్నిస్తారు. కొంతమంది అందులో ప్రవేశించగలరు అని వారు చెప్తారు. గుర్తు తెలియని ఒక వ్యక్తి యేసును సమీపించి ఉత్సుకతతో “ప్రభువా, రక్షణ పొందువారు కొద్దిమందేనా?” అని అడుగడమును లూకా 13:23లో చూస్తున్నాము. ఎంత మంది రక్షింపబడతారు అన్న పురాతన చర్చ యూదులలో ఉండేది. ఇది దానికి ప్రతిరూపమై యుండవచ్చు. అతని ప్రశ్నకు యేసు చిన్నగా సమాధానమియ్య లేదు గాని, ప్రకటన 21వ అధ్యాయం మాత్రం “కాదు” అని స్పష్టమైన సమాధానాన్నిస్తుంది. రక్షింపబడువారు అనేకమంది.

“అయితే మత్తయి 7:13, 14 సంగతి ఏంటి?” అని ఒకరు అడుగవచ్చు. “ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది. దాని ద్వారా అనేకులు జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే. ప్రవేశించువారు కొందరే” అని యేసు చెప్పారు. అంటే కొంతమంది మాత్రమే రక్షింపబడతారన్నది ఆయన ఉద్దేశం కాదు గాని, నశించువారి సంఖ్యతో పోలిస్తే, రక్షించబడినవారు “కొద్దిమంది.” ప్రకటన 7:9, 10 యిలా చెప్తుంది,

> అటుతరువాత నేను చూడగా, ఇదిగో, ప్రతి జనములోనుండియు, ప్రతివంశములో నుండియు ప్రజలలోనుండియు, ఆ యా భాషలు మాటలాడువారిలోనుండియు వచ్చి, యెవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహము కనబడెను. వారు తెల్లని వస్త్రములు ధరించుకొన్నవారై, ఖర్జూరపుమట్టలు చేతపట్టుకొని సింహాసనము ఎదుటను గొఱ్ఱెపిల్ల యెదుటను నిలువబడి – సింహాసనాసీనుడైన మా దేవునికిని. గొఱ్ఱెపిల్లకును మా రక్షణకై స్తోత్రమని మహాశబ్దముతో ఎలుగెత్తి చెప్పిరి.

దీని నేపథ్యమును గమనిస్తే, లెక్కింపలేనంత గొప్ప సమూహము ప్రతి తరమునుండి, ప్రతి

జాతినుండి, ప్రతి భాష మాటలాడు వారినుండియు గొఱ్ఱెపిల్ల రక్తము చేత విమోచింపబడిన వారిని సూచిస్తున్నాము - వారినందరిని చేర్చుకుంటుందంటే పరలోకం పెద్దదే అయియుంటుంది.

"ప్రభువా రక్షణ పొందువారు కొద్దిమందేనా?" అన్న ప్రశ్నకు యేసు ఖచ్చిత సమాధానం ఇవ్వలేదు. అలాగాకుండా, ఒక ప్రాముఖ్య విషయమునకు ప్రశ్న అడిగిన వ్యక్తిని మళ్ళిస్తున్నారు. అతడు ఆ కొద్దిమందిలో ఉంటాడా లేక అనేకమందిలో ఉంటాడా? "ఇరుకు ద్వారమున ప్రవేశింప పోరాడుడి; అనేకులు ప్రవేశింప జూతురు గాని వారివలన కాదని" యేసు అన్నారు (లూకా 13:24). ఆఖరిగా, ఎంత మంది పరలోకంలో ప్రవేశిస్తారన్నది విషయం కాదు. అయితే అసలు విషయమేమంటే పరలోకంలో ప్రవేశించే వారిలో మనం కూడా ఉంటామా. లేదా అన్నదే! అక్కడ అనేక గృహములున్నాయన్న నిశ్చయత మనకియ్యబడింది. పరలోకమునకు వెళ్ళి "ఖాళీలేదు" అన్న బోర్డును చూసి వెనుదిరిగే వారు ఎవరూ ఉండరు.

*నాలుగవదిగా, పరలోకం సురక్షితమైనది.* అక్కడనున్న సంరక్షణ గురించి ప్రకటన 21లో కొన్ని విషయాలు ఇవ్వబడ్డాయి. ఉదాహరణకు పరలోకంలో ఉన్న వారికి "ఆదియు అంతమునైయున్న అల్ఫాయు ఓమేగయు" దేవుడైయుంటాడని 6 మరియు 7 వచనములు స్పష్టం చేస్తున్నాయి. ఏ ఖర్చూ లేకుండానే జీవజలమును ఆయన మనకు ఉచితముగా యిస్తాడు. ఇది ఎంత సురక్షితమైనదంటే, నూతన యెరూషలేము పట్టణమునకు "ఎత్తయిన గొప్ప ప్రాకారములున్నాయని" 12వ వచనం చెప్తుంది. ఆ ప్రకారము "144 మూరలై ఉన్నదని" 17వ వచనం చెప్తుంది (చూడు ESV). అన్ని పురాతన పట్టణములకు ప్రకారములుండేవి. ఇవి శత్రు దుర్భేద్యముగానుండేవి. చేతులతో చిన్న చిన్న ఆయుధముల ద్వారా యుద్ధములు జరిగించే రోజుల్లో బయటివారు లోపలికి రాకుండా వారి ముట్టడిని అడ్డుకోవడానికి ఈ ప్రాకారములు ఎంతో సహాయపడేవి. అపాయకర సమయములలో పట్టణము చుట్టు ప్రక్కల సమీప గ్రామాల్లో నివసించేవారు ఆ పట్టణములో తలదాచుకునేవారు. అప్పుడు తలుపులు మూయబడేవి.

నూతన యెరూషలేమునకు ఇటువంటి ప్రాకారములే ఉన్నాయని కాని, ఇందులో ఒక విశేషిత ఇటు, అటు తిరుగుటకు పట్టణపు గుమ్మములు పగటి పూట తెరువబడే ఉంటాయి (25 వచనం). రాత్రిపూట మాత్రం పట్టణం సురక్షితముగా నుండుటకు, తలుపులు మూయబడి, ద్వారపాలకులు కాపలా కొస్తూ ఉంటారు. ఇందుకు భిన్నంగా పగటిపూట నూతన యెరూషలేము గుమ్మములు తెరువబడి ఉంటాయి. అవి ఎన్నడును మూయబడవు. అక్కడ రాత్రి ఉండదు. ఎందుకని? ఎందుకంటే అక్కడ దేవుడు మరియు గొఱ్ఱెపిల్ల యొక్క మహిమా ప్రసన్నత, సన్నిధి అక్కడ ఉంటుంది (23, 24 వచనాలు). కాబట్టి నూతన యెరూషలేము అన్ని విధాలా సురక్షితమైనది.

ఈ రోజుల్లో జీవ రసాయనికి దాడులు, తీవ్రవాద సమస్యల మూలాన సురక్షితముగా జీవించడం అనేది "ఒక పెద్ద సమస్యే!" విమానాశ్రయముల దగ్గర భద్రత, తమను తాము రక్షించుకోవడం, తమ ఆస్థులను దుండగులబారినుండి కాపాడుకోవడం, తమ ఉద్యోగ భద్రత గురించి ప్రజలు ఎక్కువగా ఆందోళన పడుతుంటారు. మన భద్రత కోసం ఎంతో ఖర్చు పెడుతుంటాము. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాము, అయినను, మనకు సరైన భద్రత కరువవుతుంది. మనం నూతన యెరూషలేము చేరుకునేంతవరకు మనకు సరైన భద్రత

దొరకదు. అక్కడ మనం ఎత్తయిన మహా ప్రాకారములు కలిగి ఎన్నడూ మూసివేయబడిన తలపులుగల పట్టణములో మనం సురక్షితముగా ఉంటాము. సర్వమును సృష్టించిన దేవుడు, మనకొరకు చనిపోయి మనలను అక్కడకు చేర్చిన గొఱ్ఱెపిల్ల మనకు రక్షణగానుండి మనలను పోషిస్తారు. ఇంతకంటే మనకు ఇంకేం కావాలి?

*ఐదవదిగా, పరలోకం సంపూర్ణమైనది.* ప్రకటన 22:1–5లో ఆ పట్టణము యొక్క వివరము ఒక తోటవలె కూడ "ఇయ్యబడింది." ఇది అన్ని తోటలవంటిది కాదు. ఈ తోటలో "జీవ జలముల నది" మరియు "జీవవృక్షము" ఉన్నాయి. "ఇకమీదట శాపగ్రస్తమైన దేదియు దానిలోనుండవు. దేవునియొక్కయు, గొఱ్ఱెపిల్లయొక్కయు సింహాసనము దానిలో ఉండును. ఆయన దాసులు ఆయనను సేవించుచు, ... వారు యుగయుగములు రాజ్యము చేయుదురు" (3–5 వచనాలు). ఇది అర్థమవుతుందా? ఆదికాండము 3వ అధ్యాయములో వ్రాయబడిన పాపంలోనికి "పతనం" స్థితికి వ్యతిరేకంగా, భిన్నంగా, ఒక క్రొత్త పరిస్థితిని 1–5 వచనాలు వివరిస్తున్నాయి. ఆ తోటలో మానవుడు దేవునితో తన సంబంధమును, తన భద్రతను, జీవవృక్ష ఫలములు తినకుండ తన అర్హతను కోల్పోయాడు. మరియు అదే తోటలో సర్పం, మానవుడు, స్త్రీ, ఆఖరికి భూమి కూడా శపించబడింది. నూతన యెరూషలేములో పరిస్థితి తారుమారైంది. ఆదికాండము 3లో "పరదైసు కోల్పోబడితే" ప్రకటన 22లో "పరదైసు పునరుద్ధరించబడడంను" మనం చూస్తున్నాము.

పరలోకంలో మనం దేవునితో సంపూర్ణమైన విడిపోని సహవాసమును పాపముల క్షమాపణ, మరియు సంపూర్ణ స్వస్థత కలిగియుంటాము. మన పాపములు పూర్తిగా క్షమింపబడి, సంపూర్ణ స్వస్థత చేకూరుతుంది. దేవునికి చెందిన యావత్తును – తిరిగి ఆయన తన యొద్దకే చేర్చుకుంటాడు. ఇందులో మనం కూడా ఉంటాము.

### అక్కడ ఎవరుంటారు?

ఇప్పటి వరకు పరలోకాన్ని గురించిన వర్ణనను మనం చూశాము. అయితే "ఎవరు అక్కడకు వెళ్ళగలరు?" అన్న ప్రశ్నను మనం అడగాలి. నూతన యెరూషలేములో జీవించే అద్భుత అవకాశం. నిత్యత్వము యొక్క అద్భుత ఆశీర్వాదం అయిన దేవునితో సహవాసం కలిగియుండే అవకాశం ఎవరికి లభిస్తుంది?

సమాధానమంటే, ప్రతి ఒక్కరు పరలోకం వెళ్ళగలరు కానీ అందరూ వెళ్ళరు. "పరలోకం అనేది సిద్ధపడిన ప్రజలకు సిద్ధపర్చబడినది" అని కొందరు చెబుతారు. మరోమాటలో చెప్పాలంటే, పరలోకం వెళ్ళడం అనేది అనుకోకుండానే, అదృష్టంకొద్దీ జరిగేది కాదు. అక్కడకు వెళ్ళుటకు దానిమీదనే తమ దృష్టియుంచినవారు నిత్యత్వ లక్ష్యమును చేరుకోవడానికి తమ మార్గంలో ఏది అడ్డుగా వచ్చినా ముందుకు సాగిపోయేవారు మాత్రమే అక్కడకు చేరుకుంటారు. మనం ఎలా "సిద్ధపడగలం"? గొఱ్ఱెపిల్ల అయిన యేసును అనుసరించడం ద్వారా, కేవలం ఆయన్ను మాత్రమే అనుసరించడం ద్వారా వెళ్ళగలం.

పరలోకము ఉన్నదన్నది ఎంత సత్యమో అలాగే నరకం కూడాను. ప్రకటన ఆఖరి రెండు అధ్యాయములలోనే యోహాను దాన్ని చెప్పడం లేదు, అనేక మార్లు దీన్ని ప్రస్తావించాడు. క్రైస్తవ్యం "సార్వత్రిక రక్షణ" మతం కాదు. అందరూ రక్షింపబడతారని వాక్యం చెప్పడం లేదు. యేసు అందిస్తున్న అవకాశమును వ్యతిరేకించేవారు దేవుని నుండి శాశ్వతముగా

దూరం చేయబడరని ప్రకటన గ్రంథం మాత్రమే గాక క్రొత్త నిబంధన అంతయు బోధిస్తుంది. యోహాను యిలా వ్రాస్తున్నాడు,

> పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధికులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు. ఇది రెండవ మరణము (21:8).
>
> గొఱ్ఱెపిల్లయొక్క జీవగ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశించుదురు గాని నిషిద్ధమైన దేదైనను, అసహ్యమైనదానిని అబద్ధమైనదానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు (21:27).
>
> జీవవృక్షమునకు హక్కుగలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు. కుక్కలును మాంత్రికులును వ్యభిచారులును నరహంతకులును విగ్రహారాధకులును అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును వెలుపటనుందురు (22:14, 15).
>
> ఈ గ్రంథమందున్న ప్రవచనవాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా – ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసినయెడల, దేవుని ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను, పరిశుద్ధ పట్టణములోను వానికి పాలులేకుండ చేయును (22:18, 19).

పరలోకంలో ఎటువంటి వారు ప్రవేశింపరు అన్న విషయాన్ని ఈ వాక్యభాగములు తెలియజేస్తున్నాయి. దుష్ట మార్గములో జీవిస్తున్న వారికి హెచ్చరికగా, గొఱ్ఱెపిల్లను అనుసరిస్తున్న వారికి ప్రోత్సాహకరంగా ఇవి వ్రాయబడ్డాయి. ఈ లోకం మాదిరిగా గాకుండా, దుష్టుల ప్రవేశంతో పరలోకం కాలుష్యం కాబోదు.

మనలో ప్రతి ఒక్కరికి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. క్రీస్తునకు మనలను మనం సమర్పించుకుని పరలోకపు ఆశీర్వాదములను పొందడమా లేక మన పాపముల నిమిత్తం ఆయన త్యాగమును *విస్మరించి* దేవుని సన్నిధినుండి శాశ్వతంగా దూరమవడమా అన్న విషయాన్ని మనం నిర్ణయించుకోవాలి.

“**ఆత్మయు** పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను; దప్పిగొనిన వానిని రానిమ్ము; ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము” (22:17). నిత్య జీవమునకు దేవుడు అందరికీ బహిరంగ ఆహ్వానం పలుకుతున్నాడు. దీన్ని మనం అంగీకరించాలా లేక త్రోసివేయడమా అన్నది మనం తీసుకోవలసిన నిర్ణయం. ఈ జీవితంలో మనకేది వచ్చినా దానికి తగిన విలువ ఉంది. అందుకు మనకు దేవుని వాగ్దానం ఉంది.

---

## యుగాంతం ఎప్పుడో మనం ముందుగానే చెప్పగలమా?

మత్తయి 24 మరియు దాని వాక్యభాగములను (మార్కు 13; లూకా 21) చదివి యుగాంతమునకు కొన్ని సూచనలను యేసు అందించారని కొంతమంది వేదాంత విద్యార్థులు చెపుతారు. (కొన్ని రకాల బైబిలు తర్జుమాలలో మత్తయి 24వ అధ్యాయమునకు

"యుగాంతమునకు సూచనలు" అన్న శీర్షిక ఇయ్యబడింది.) ఎవరు కూడ దేవుని రాకడను ముందుగా చెప్పలేరని యేసు చెప్పిన మాటను బట్టి ఇది ఖచ్చితంగా వక్ర వ్యాఖ్యానం అని నిర్ధారణమవుతుంది. ఆఖరికి, ఈ అధ్యాయం యొక్క అంశం కూడా ఇది కాదు.

నిజానికి, మత్తయి 24వ అధ్యాయంలోని మొదటి నుండి కొన్ని వచనాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, *దేవాలయపు వినాశనం* గురించి ఆయన శిష్యులు అడిగిన ప్రశ్నకు యేసు సమాధానమిస్తున్నారు, "నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి?" (3 వచనం) అని శిష్యులు రెండవ ప్రశ్నను అడుగుతున్నారు. మరో మాటలో చెప్పాలంటే, రెండు ప్రశ్నలు అడుగబడి, సమాధాన మియ్యబడ్డాయి. ఆయన రాకడ సమయము గురించి ముందుగా చెప్పు వారిని ఆయన హెచ్చరిస్తున్నాడు. యుద్ధములు, "యుద్ధ సమాచారములు" అనేవి యుగాంతమునకు సూచనలు కావు. (ఇది 6వ వచన సాధారణ భావనకు వ్యతిరేక.) "అంతము వెంటనే రాదు" (6 వచనం), "అక్కడక్కడ కరవులును" (7 వచనం), "భూకంపములును సంభవించును" (8 వచనం) అన్నది కూడ యుగాంతమునకు సూచన కాదు. కానీ ఇది వేదనలకు ప్రారంభము. యెరూషలేము నాశం కాబోవుచున్నను, ఈ సూచనలను ఆయన రాకడకు గురుతులుగా భావించకూడదని యేసు 15 నుండి 28 వచనాలో మాటిమాటికి చెప్పారు.

29వ వచనం నుండి యెరూషలేము నాశనం మరియు యుగసమాప్తికి సంబంధించిన కొన్ని వివరాలను ఆయన కలిపి చెప్పారు. ఆ మహాదినము యొక్క సమయం ఎప్పుడో ఆయనకు గాని దేవదూతలకు గాని తెలియదని ఆయన చెప్పారు. యుగసమాప్తి ఎప్పుడు సంభవిస్తుందాయనే లేఖనాలను శోధించి ముందుగానే తెలియచెప్పడం మన బాధ్యత కాదు గాని, అది ఎప్పుడు సంభవించినను, దైవిక జీవితమును జీవిస్తూ దాని కొరకు సిద్ధపడి ఎదురుచూస్తుండుటయే మన బాధ్యత (24:44–25:46). ఇదే విషయం 1 థెస్సలొనీకయులకు 5:1–11లోనూ కనబడుతుంది.

---

## మృతులు ఎక్కడ ఉన్నారు?

"చనిపోయిన తరువాత మనకు ఏం జరుగుతుంది?" అన్నది సర్వత్రా వినిపించే ప్రశ్న. (నమ్మకస్థులైన క్రైస్తవులుగా) మనం చనిపోయినప్పుడు మనం వెంటనే పరలోకం వెళ్ళతాము లేక పునరుత్థానం వరకు ఆగుటకు "మధ్యమార్గ స్థితి" ఏదయినా ఉందా? పరలోకం గురించి బైబిలు చెప్తున్న వాక్యభాగాలు అలంకార రీతిలో ఉండడం వలన దీని నిర్ణయించడం కొంచెం కష్టం.

అయితే ఒక వాక్య భాగంలో మాత్రం ఎటువంటి అలంకార భాష ఉపయోగించబడలేదు కాబట్టి మనం తిన్నగా పరలోకమునకే వెళ్ళతాము అని చెప్పవచ్చు. శరీరమందు నిలచి అపొస్తలిక పరిచర్యను కొనసాగించడం మరియు మరణమయి నిత్య జీవములో ప్రవేశించడం అన్న రెండు విషయాల మధ్య ఇరుకున బడియున్నట్లు పౌలు ఫిలిప్పీయులకు వ్రాస్తూ పేర్కొంటున్నాడు. "ఈ రెంటి మధ్యను ఇరుకునబడియున్నాను" అని అతడు అంటున్నాడు. అయితే, "నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెను" అన్న ఆశ అతనికి ఉందని వివరిస్తున్నాడు (ఫిలిప్పీయులకు 1:23). మరణము క్రైస్తవుని దేవుని సన్నిధానమునకు తిన్నగా తీసుకెళ్ళుతుందని పౌలు చెప్తున్నాడు. "పరలోకం" అంటే ఏదయినా గాని, అది క్రీస్తులో

ఉండడం అన్నది మాత్రం సత్యం. ఇది అన్నిటి కంటెను మేలైనది.

పౌలు చెప్పినది యేసు సిలువలోని దొంగతో చెప్పిన విషయమునకు సరిగ్గా సరిపోయింది. నీవు, నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను "జ్ఞాపకము చేసికొనుము" అని అతడు అడిగినప్పుడు "నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువు" (లూకా 23:42, 43) అని యేసు అన్నారు. ఇక్కడ కూడ, నిత్యత్వ ఆశీర్వాదం అంటే, దేవుని సన్నిధిలోనుండడం. మనం ఎక్కడ ఉండబోతున్నాం, ఎక్కడ ఆ స్థలం ఉంటుంది, అది ఎలా ఉంటుంది అన్న విషయం మనకు ముఖ్యం కాదు గాని మన సృష్టికర్త, మన రక్షకుడు అయిన దేవుని సన్నిధిలో ఉండడమే ముఖ్యం. ఆయనతో సదాకాలం ఉంటే అది చాలు.